సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023



చిట్టి ధాన్యం.. గట్టి ఆరోగ్యం..!

చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం. చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు ఉండడంతో ప్రజలు వాటిని వినియోగించడానికి ఇష్టపడుతున్నారు. - 8లో



సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజల నుంచి వచ్చే సమస్యల సత్వర పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. - 8లో



అసోసియేట్ డీన్‌గా మక్కేన శ్రీను

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పశువైద్య కళాశాల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ మక్కేన శ్రీను సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కృష్ణాజిల్లా గన్నవరం పశువైద్య కళాశాలలో శస్త్ర చికిత్స విభాగ అధిపతిగా పనిచేస్తున్న ఆయన గరివిడి పశువైద్య కళాశాలలో అసోసియేట్ డీన్‌గా నియామకమయ్యారు.

న్యూస్‌రీల్

నేడు పోలమాంబ మూడో జాతర



పోలమాంబ అమ్మవారు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారి మూడో జాతర మంగళవారం జరగనుంది. ఈఓ వి.రాధాకృష్ణ ఆధ్వర్యంలో జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం క్యూలు ఏర్పాటు చేశారు. లడ్డూప్రసాదం, పులిహోరా ప్రసాదం తయారు చేయించారు. క్యూకాంప్లెక్స్‌ల వద్ద మంచినీటి సౌకర్యం కల్పించనున్నారు. సాలూరు సీఐ ధనంజయరావు ఆధ్వర్యంలో జాతరలో పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు. పార్వతీపురం, సాలూరు, బొబ్బిలి పట్టణాలనుంచి జాతరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనుంది. ఎంపీడీఓ పి.దేవకుమార్ సమక్షంలో పారిశుద్ధ్య పనులు సాగుతున్నాయి.

క్షేత్రస్థాయిలో పర్యటించాలి

- జాయింట్ కలెక్టర్ ఆనంద్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జేసీ ఒ.ఆనంద్

పార్వతీపురం: మండలస్థాయి అధికారులు క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం మండల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ మండలాల్లో 200టవర్ల నిర్మాణానికి వెంటనే స్థలాన్ని గుర్తించి నివేదిక సమర్పించాలని సూచించారు. రీసర్వేలోఫారం-8ను జనరేట్ చేయాలని స్పష్టం చేశారు. పాలకొండ, బలిజిపేట, సీతానగరం, మక్కువ మండలాల్లో పట్టాల పంపిణీలో జాప్యం జరుగుతోందని, త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి డేటా ఎంట్రీ పక్కాగా ఉండాలని పేర్కొన్నారు. గృహనిర్మాణాల ప్రగతిలో సీతానగరం, కొమరాడ మండలాలు వెనుకబడి ఉన్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. లబ్ధిదారులను సమాయత్తం చేసి నిర్మాణాల వేగం పెంచాలని సూచించారు. సాలూరు, పాలకొండ పట్టణ గృహనిర్మాణాలపై దృష్టి సారించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ జె.వెంకటరావు, డీఎంహెచ్‌ఓ జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జీటీ డబ్ల్యూఓ ఈఈ శాంతేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఒ.ప్రభాకరరావు, ఇన్‌చార్జ్ డీఈఓ పి.బ్రహ్మాజీరావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఖజానా అధికారిగా అశోక్



అశోక్‌ను అభినందిస్తున్న ఏపీటీఎస్‌ఏ నాయకులు, ఖజానా శాఖ సిబ్బంది

విజయనగరం అర్బన్: జిల్లా ఖజానా, లెక్కల అధికారిగా రుద్రపాటి అశోక్ సమర్పణ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు జిల్లా ఖజానా అధికారిగా ఉన్న ఎస్ఆర్‌కే గణేష్ అనారోగ్య కారణాలతో సెలవు పెట్టడంతో ఉమ్మడి జిల్లా ఖజానా అధికారిగా అశోక్ సమర్పణ కుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయనకు ఏపీటీఎస్‌ఏ నాయకులు, ఖజానా కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సహాయ ఖజానా అధికారులు నితిన్, ఆదిత్య, ఏపీటీఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి పద్మనాభం, జిల్లా కార్యవర్గ సభ్యులు సురేష్, సంతోషి, రామకృష్ణ, చంద్రశేఖర్, నాగమునిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు చింతలపేట విద్యార్థులు



విద్యార్థులతో హెచ్‌ఎం శారద, పీడీ లక్ష్మణ్

గుర్ల: జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు చింతలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు పి.యశ్వంత్, పి.పైడిరాజు, ఎస్.వర్ధిని ఎంపికయ్యారు. కేరళ రాష్ట్రం ఎర్నాకులంలో ఈ నెల 18, 19 తేదీల్లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో తలపడనున్నారు. వీరిని హెచ్‌ఎం శారద, పీడీ కె.లక్ష్మణ్, సర్పంచ్ భాస్కరరావు పాఠశాలలో సోమవారం అభినందించారు.

ఆదుకుంటున్న అంబులెన్సులు



జిల్లా కేంద్రంలో 108 అంబులెన్సు

- 108 వాహనంలో ఆధునిక వైద్య పరికరాలు
- గర్భిణులకు, క్షతగాత్రులకు అండగా నిలుస్తున్న అంబులెన్స్‌లు
- నవజాతి శిశువుల కోసం నియోనేటల్ అంబులెన్స్
- కొత్త జిల్లాలో నేటి వరకు 27,943 మందికి సేవలు
- అందుబాటులో 17 అంబులెన్సులు

పార్వతీపురం టౌన్:

ఆపద సమయాన 108 వాహనాలు క్షణాల్లో చేరుకుంటున్నాయి. గర్భిణులు, ప్రమాద బాధితులకు ప్రాథమిక వైద్యం అందిస్తున్నాయి. సకాలంలో ఆస్పత్రికి చేర్చి ప్రాణాలు నిలుపుతున్నాయి. అందిరికీ ఆదుకునే నేస్తాలుగా సుపరిచితమయ్యాయి. కుయ్..కుయ్..కుయ్‌మంటూ సైరన్ మోగుతూ 108 వాహనం రోడ్డుపై తిరుగుతుంటే మొదటిగా గుర్తుకు వచ్చేది దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి. ఆ మహానీయుడు అందుబాటులోకి తెచ్చిన 108 వాహనాలు ప్రస్తుతం అవిశ్రాంతంగా సేవలందిస్తున్నాయి. 2014లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం వాహన సేవలపై శీతకన్ను వేసినా అనంతరం వచ్చిన జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం సేవలను పునరుద్ధరించింది. వాహనాలకు ఆధునిక హంగులు అద్దింది. రూ.కోట్ల ఖర్చుతో కొత్తవాహనాలను, ఆధునిక వైద్యపరికరాలను సమకూర్చింది. పిల్లల కోసం ప్రత్యేకంగా నియోనేటల్ అంబులెన్స్‌లను సైతం అందుబాటులోకి తెచ్చింది.

15 మండలాల్లో 17 అంబులెన్సులు...

జిల్లా పునర్విభజన జరిగాక పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాలు ఉండగా, 17 అంబులెన్స్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 45 మంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లు, మరో మంది పైలట్లు నిత్యం ప్రజలకు సేవలందిస్తున్నారు. కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి 108 వాహనాల్లో బాధితులను ఆస్పత్రులకు తరలించారు. రోడ్డు ప్రమాద బాధితులు, రోగులు, గర్భిణులు, పురిటిబిడ్డలను సకాలంలో ఆస్పత్రులకు చేర్చి ప్రాణాలు కాపాడుతున్నారు. కొత్తజిల్లా ఏర్పడిన నుంచి నేటి వరకు 27,943 మంది 108 అంబులెన్స్‌ల సేవలు పొందారు.

ఆధునిక వైద్యపరికరాల ఏర్పాటు

- 108లో ఆధునిక వైద్యపరికరాలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.
- ఆక్సిజన్ అందించే ట్రాన్స్‌పోర్టు వెంటిలేటర్



108 వాహనంలో సేవలందిస్తున్న వైద్య సిబ్బంది

(రోగులు శ్వాస తీసుకోవడం ఇబ్బంది పడుతున్నా, ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నా ప్రాణాపాయ పరిస్థితి నుంచి కాపాడేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుంది.
- ఈసీజీ స్థాయిని నిరంతరం చూడడంతో పాటు బీపీని పర్యవేక్షించేందుకు, జ్వర తీవ్రత తెలుసుకునే పరికరాలను ఉంచారు.
- సిరంజి పంపు (అత్యవసర సమయంలో అవసరమయ్యే మందు నిర్దేశిత సమయంలో ఇవ్వటానికి ఉపయోగపడుతుంది).
- వాల్యూమ్ ఇన్ఫ్యూజన్ పంపు (రోగికి ఫ్లూయిడ్స్ ఇచ్చేందుకు)
- పల్స్ ఆక్సీమీటర్ (నాడి కొట్టుకునే విధానాన్ని, ఆక్సిజన్ శాతాన్ని తెలుసుకునేందుకు)
- ప్రతి వాహనంలో డబుల్ ఆక్సిజన్ సిలిండర్లు (శ్వాస తీసుకునేందుకు దోహదపడతాయి)
- సెక్షన్ ఆపరేటర్ (పురుగుల మందు తాగిన వారికి కడుపు శుభ్రపరిచేందుకు)

మన్యంలో 108 అంబులెన్సుల సేవలు ఇలా...

మండలాలు:	15
అంబులెన్సులు:	17
నవజాత శిశు అంబులెన్సులు:	02
సేవలు పొందిన గర్భిణుల సంఖ్య:	8,183
క్షతగాత్రులు:	1263
కోవిడ్ బాధితులు:	31
ఇతర అత్యవసర సేవలు:	18,466

మెరుగైన ప్రాథమిక వైద్యం



గతానికి భిన్నంగా అధునాతన పరికరాలతో 108 అంబులెన్సుల సేవలు అందిస్తున్నాం. ఆపదలో ఉన్న వారు ఫోన్ చేసిన 20 నిమిషాల్లో అంబులెన్స్ అక్కడికి చేరుతుంది. ఆపదలో ఉన్నవారికి ఈఎంటీ సిబ్బంది, పైలెట్‌లు మెరుగైన ప్రాథమిక వైద్యం అందిస్తూనే ఆస్పత్రికి చేరుతున్నారు. ప్రభుత్వం 108 అంబులెన్సులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఎవరికి ఏ అనారోగ్యసమస్య వచ్చినా ముందుగా గుర్తుకొచ్చేది 108 అంబులెన్స్‌లే.

– మన్మథనాయుడు, 108 అంబులెన్సుల జిల్లా మేనేజర్, పార్వతీపురం మన్యం



పాఠశాల ఆవరణలో ఉన్న పూరిళ్లు

ఆక్రమణల వలయంలో.. చదువుల నిలయం

పై చిత్రం చూశారా.. వీరఘట్టం మండలం తెట్టంగి ఉన్నత పాఠశాల మైదానంలో వేసిన పూరిపాకలు ఇవి. దశాబ్దాల తరబడి ఇలా బడి ఆవరణలోనే 11 కుటుంబాలు పూరిళ్లు కట్టుకుని నివసిస్తున్నాయి. తరగతుల నిర్వహణకు ఇబ్బందులు ఎదురవుతున్నాయంటూ ఉపాధ్యాయులు గగ్గోలు పెడుతున్నా వీరు మాత్రం ఖాతరు చేయడం లేదు. ఎకరా విస్తీర్ణం కలిగిన మైదానంలో అధిక భాగాన్ని ఆక్రమించేశారు. పశువులు, కోళ్ల సంచారం, ఆయా కుటుంబాల కేకలు, అరుపులతో విద్యార్థుల చదువులకు ప్రతినిత్యం ఆటంకం కలుగుతోంది. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో స్థలాలు కేటాయించి ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇస్తుందని, తక్షణమే ఖాళీ చేయాలని గతంలో ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ జల్లేపల్లి మాధవి నచ్చజెప్పినా వీరి నుంచి స్పందన శూన్యం. పాఠశాలలో చదువుతున్న 132 మంది విద్యార్థులు సమస్యల నడుమ చదువులు సాగిస్తున్నారు. మైదానం ఆక్రమణలకు గురికావడంతో ఆటలకు దూరమవుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని గ్రామస్తులు చెబుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని, ఆక్రమణలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఎట్టిపరిస్థితుల్లోనూ ఖాళీ చేయిస్తానని ప్రస్తుత తహసీల్దార్ సీహెచ్ సత్యనారాయణ తెలిపారు. ఏం చేస్తారో చూడాలి మరి.!

– వీరఘట్టం



తెట్టంగి జిల్లా పరిషత్ హైస్కూల్



పూరిల్లు ఖాళీ చేయాలని చెబుతున్న గత తహసీల్దార్ మాధవి (ఫైల్)

'మత్తు'వదిలించేందుకు పటిష్ట ప్రణాళిక



మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి

విజయనగరం అర్బన్: మత్తు పదార్థాల వినియోగాన్ని పూర్తిగా నియంత్రించేలా పటిష్ట ప్రణాళిక రూపొందించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. జాతీయ బాలల హక్కుల కమిషన్, మాదక ద్రవ్యాల నిరోధక శాఖలు సంయుక్తంగా రూపొందించిన జాయింట్ యాక్షన్ ప్లాన్ అమలుపై తన చాంబర్‌లో సంబంధిత శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగంపై నిఘాపెంచి దాడులు చేయాలన్నారు. మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. దీని కోసం స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని కోరారు. మద్యం షాపుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ యాక్షన్ ప్లాన్ నోడల్ ఆఫీసర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి.సుధీర్, డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్.వి.రమణకుమారి, ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి, ఔషధ నియంత్రణశాఖ ఏడీ కె.రజిత, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి పి.రత్నం, బీసీ సంక్షేమాధికారి యశోధనరావు, మున్సిపల్ హెల్త్ఆఫీసర్ డాక్టర్ కేవీఎస్ సత్యనారాయణ, జిల్లా బాలల సంరక్షణాధికారి ఎ.సత్యనారాయణ, జిల్లా యువజన సమన్వయాధికారి విక్రమాదిత్య, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచితంగా పరికరాలు

పార్వతీపురం: దివ్యాంగులకు ఉచిత పరికరాల పంపిణీ కోసం పార్వతీపురం చర్చివీధిలోని డాక్టర్ డీవీవీఎం పాఠశాలలో ఈనెల 8న ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ పీవీ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలు, 5-18 ఏళ్ల వయస్సుల విద్యార్థులు శిబిరానికి హాజరుకావాలన్నారు.

పాపం.. ట్రాకర్..!

- ఎలిఫెంట్ ట్రాకర్‌ను తొక్కిచంపిన గజరాజులు
- పెళ్లిపీటలు ఎక్కకుండానే పరలోకాలకు..
- పసుకుడిలో అలముకున్న విషాదం
- ఏనుగుల గుంపు సంచారంతో భయపడుతున్న జనం

భామిని:



లక్ష్మీనారాయణ (ఫైల్)

ఆ యువకుడు నాలుగేళ్లుగా గజరాజులతో స్నేహం చేస్తున్నాడు. ఎలిఫెంట్ ట్రాకర్‌గా ఉత్తమ సేవలందిస్తున్నాడు. ఇప్పుడు అదే గజరాజుల దాడిలో ప్రాణాలు విడిచాడు. మరికొద్ది రోజుల్లో పెళ్లిపీటలు ఎక్కాల్సిన యువకుడు ఏనుగుల దాడిలో మరణించడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. కళ్లముందే ఏనుగులు తొక్కిచంపుతున్నా.. రక్షించలేకపోయామంటూ పసుకుడి గ్రామస్తులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ట్రాకర్ మృతితో భామిని మండలంలోని పసుకుడి గ్రామంతో పాటు ఆయన స్వగ్రామం శ్రీకాకుళం జిల్లా పాతపట్నం మండలం నవర తిడ్డిమిలో విషాదం అలముకుంది.



ట్రాకర్ లక్ష్మీనారాయణ మృతదేహాన్ని పరిశీలిస్తున్న అటవీ సిబ్బంది

ఘటన జరిగిందిలా...

పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలోని తివ్వాకొండలపైకి చేరిన ఐదు ఏనుగుల గుంపు ఇటీవల మళ్లీ కొండ దిగాయి. మూడు రోజుల కిందట వీటి నుంచి హరి అనే ఏనుగు విడిపోయింది. నాలుగు గజరాజులు మండలంలోని నాగావళి నదీ తీర ప్రాంతంలో సంచరిస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులు గగ్గోలు పెడు తుండడంతో తిరిగి అటవీ ప్రాంతంలోకి మళ్లించే చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి 7 గంటల సమయంలో ట్రాకర్ లోకొండ లక్ష్మీనారాయణ(25)తో పాటు గ్రామస్తులు పలువురు కాగడాలతో ఏనుగులు సంచరిస్తున్న పసుకుడి పొలిమేరల్లోకి చేరుకున్నారు. వాటిని కొండలవైపు మళ్లిస్తుండగా... ఏనుగులు తిరగబడ్డాయి. ఆ క్రమంలో అందరూ పరుగు తీశారు. లక్ష్మీనారాయణ కాలుజారి కిందపడిపోవడంతో ఏనుగులు తొండంతో విసిరి కొట్టాయి. కాళ్లతో ముఖంపై తొక్కిచంపాయి. ఓ గంట సమయం పాటు ఘటనా స్థలం వద్దే తిష్టవేశాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనం వచ్చినా ఫలితం లేకపోయింది. గ్రామస్తులందరూ ఏకమై ఏనుగులను అదిలించడంతో కొద్దిదూరం వెళ్లాయి. ఘటనా స్థలానికి అటవీ, పోలీస్ అధికారులు చేరుకు న్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతునికి తండ్రి లోకొండ సింహాచలం, తల్లి అప్పలమ్మ ఉన్నారు. అన్నయ్య శ్యామ్‌కుమార్ కుటుంబంతో కలిసి శ్రీకాకుళంలో నివసిస్తున్నాడు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భయంభయం...

ఏనుగుల వరుస దాడులతో ఈ ప్రాంతీయులు భయాందోళన చెందుతున్నారు. ఇటీవల తాలాడలో పొలానికి నీరుకట్టేందుకు వెళ్లిన గోపిశెట్టి చిన్నారావు అనే రైతులను పొట్టనపెట్టుకున్నాయి. ఇప్పుడు ఏళ్ల తరబడి ఏనుగులను సాకుతున్న ట్రాకర్‌ను హతమార్చాయి. దీంతో ఈ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.



పసుకుడిలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు

శివరాత్రి ఉత్సవాలకు పక్కా ఏర్పాట్లు

- భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకూడదు
- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు
- బోర్డు సమావేశం ఏర్పాటు చేయకపోవడంపై ఆగ్రహం
- శివరాత్రి ఉత్సవాలపై అధికారులతో సమీక్ష

నెల్లిమర్ల రూరల్:



శివరాత్రి ఉత్సవాలపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు,ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్ బాబు

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో ఈ నెల 18 నుంచి జరగనున్న శివరాత్రి ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి వివిధ శాఖల అధికారులతో సోమవారం సమీక్షించారు. శాఖల వారీగా అధికారులతో మాట్లాడి ఉత్సవాల ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులను నడపాలన్నారు. వైద్య సేవలు అందించడంతో పాటు అంబులెన్సులను ఏర్పాటు చేయాలన్నారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు. తమిళనాడులోని అరుణాచలేశ్వర పర్వతంపై వెలిగించినట్టే రామతీర్థంలో కూడా మహాశివరాత్రి పర్వదినాన కోదండ రామస్వామివారి పర్వతంపై సొంత ఖర్చుతో శిఖరదీపం ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. క్షేత్ర పరిసర ప్రాంతాల్లో అదనపు విద్యుత్ కాంతులను ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు బాణసంచా సంబరాన్ని జరిపిస్తున్నామన్నారు.

బోర్డు మీటింగ్ నిర్వహించకపోవడంపై ఆగ్రహం

రామతీర్థం ట్రస్టు బోర్డు ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్నా బోర్డు మీటింగ్ ఏర్పాటు చేయకపోవడంపై దేవస్థాన ఈఓ ప్రసాదరావుపై ఎమెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎందుకు సమావేశం ఏర్పాటు చేయలేకపోయారని ప్రశ్నించారు. పద్ధతి ప్రకారం సభ్యులకు సమాచారం అందించి త్వరలో సమావేశం ఏర్పాటు చేయాలని సూచించారు. ఆలయ నిర్వహణ, ఖర్చుల వివరాలను బోర్డు సభ్యులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు సూర్యకళ, అప్పారావు, ఎంపీపీ అంబళ్ల సుధారాణి, రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, డీసీసీబీ వైస్ చైర్మెన్ చనమళ్ల వెంకటరమణ, టూరిజం బోర్డు రాష్ట్ర డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, వైస్ చైర్మెన్ సముద్రపు రామారావు, ఎంపీడీఓ గిరిబాల, తహసీల్దార్ రమణరాజు, సీఐ విజయనాథ్, ఎస్సై నారాయణరావు, ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి పట్టాభిషేకం

రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో శ్రీరామచంద్రప్రభువు పట్టాభిషేక మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు, రుత్వికుల సమక్షంలో వేకువజామునుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు సాగాయి. సీతారామచంద్ర ప్రభువుల వారిని ఆస్థాన వెండి మండపంలో వేంచింపజేసి పట్టాభిషిక్తుని చేశారు. సాయంత్రం 6 గంటలకు వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి పుష్పార్చన జరిపారు. అనంతరం ద్వాదశిఆరాధన, సప్తావరణ జరిపించి స్వామివారికి పవళింపు సేవ, ఆరగింపు తదితర కార్యక్రమాలను చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బందితో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



పుష్పాలంకరణలో సీతారామస్వామి

క్లుప్తంగా

11 నుంచి హిందీ పరీక్షలు

రాజాం: దక్షిణ భారత హిందీ ప్రచార సభ (మద్రాసు)కు చెందిన పరీక్షలు ఈనెల 11 నుంచి రెండురోజుల పాటు జరగనున్నాయని హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశిక, విశారద, ప్రవీణ పరీక్షలు 11, 12 తేదీల్లో రెండురోజుల పాటు జరుగుతాయని, పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష పరీక్షలు 12న జరగనున్నాయని వివరించారు. హాల్ టికెట్ల నిమిత్తం ఫోన్ 99499 17365 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఏఈపై విజిలెన్స్ విచారణ



జోగారావు నుంచి వివరాలు తీసుకుంటున్న విజిలెన్స్ సిబ్బంది

బొబ్బిలి: ఏపీఈపీడీసీఎల్ పట్టణ ఏఈ బి.సాంబశివరావుపై స్థానిక ఉపాధ్యాయుడు కురమాన జోగారావు ఇచ్చిన అవినీతి ఆరోపణలపై విజిలెన్స్ సీఐ కె.కృష్ణ, ఎస్సై డీడీ నాయుడు, సిబ్బంది శ్రీనివాసరావులు విచారణ చేపట్టారు. ఈ మేరకు అధికారులు బొబ్బిలి వచ్చి జోగారావు చేసిన ఫిర్యాదుపై ఆయన నుంచి మరిన్ని వివరాలు నమోదు చేసుకుని వెళ్లారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో దీనికి సంబంధించిన విచారణ చేశారు. వీధిలైటు వేసేందుకు ఏఈ సాంబశివరావు ఉపాధ్యాయుడు జోగారావును రూ.15వేలు లంచం డిమాండ్ చేసినట్టు ఉన్నతాధికారులకు ఆయన ఫిర్యాదు చేశారు.

13 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత



విజిలెన్స్ అధికారులు పట్టుకున్న పీడీఎస్ బియ్యం

సీతంపేట: మండలంలోని మొగధార గ్రామంలో ఓ వ్యాపారి ఇంటివద్ద అక్రమంగా నిల్వ చేసిన 13 క్వింటాళ్ల 30 కిలోల పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు సోమవారం పట్టుకున్నారు. వాటి విలువ రూ.50,540 ఉంటుందని అంచనా వేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై బి.రామారావు తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని చెప్పారు. బాధ్యుడిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ మధుసూదనరావు, వీఆర్వో పద్మ, కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ తదితరులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

గజపతినగరం రూరల్: ఎటువంటి అనుమతులు లేకుండా చంపావతి నదినుంచి ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నామని ఎస్సై గంగరాజు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీరంగరాజుపురం గ్రామం వద్ద బెల్లాన లక్ష్మునాయుడు, చిప్పాడ సురేష్‌లను, ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించినట్లు చెప్పారు. ట్రాక్టర్లను సీజ్‌చేసి కేసు నమోదు చేశామన్నారు.

చిట్టి ధాన్యం.. గట్టి ఆరోగ్యం..!



వ్యవసాయ పరిశోధన స్థానం

- చిరుధాన్యాల వినియోగంపై ప్రజల ఆసక్తి
- జిల్లాలో 3 వేల హెక్టార్లలో సాగు
- అధిక దిగుబడినిచ్చే వంగడాల కోసం శాస్త్రవేత్తల కృషి

విజయనగరం ఫోర్ట్: చిరుధాన్యాలు తినడం వల్ల కలిగే ప్రయోజనాలు అనేకం. చిరుధాన్యాల్లో అధిక పోషక విలువలు ఉండడంతో ప్రజలు వాటిని వినియోగించడానికి ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కూడా చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది.ఈ క్రమంలో రైతులకు అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలను వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు ఇప్పటికే అందించారు. ఇంకా అందించడానికి పరిశోధనలు చేస్తున్నారు.

12 చోడి రకాల విడుదల

జిల్లా కేంద్రంలో వ్యవసాయ పరిశోధన స్థానం ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 12 రకాల చోడి వంగడాలను శాస్త్రవేత్తలు విడుదల చేశారు. ఇంతవరకూ విడుదలైన విజయనగరం -1, విజయనగరం -2, సింహాద్రి, సూరజ్, చంపావతి, భారతి, శ్రీచైతన్య, హిమ, సువర్ణముఖి, వేగావతి, ఇంద్రావతి, గోస్తనీ రకాల వంగడాల్లో ఇంద్రావతిని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విడుదల చేశారు.



పరిశోధన చేస్తున్న శాస్త్రవేత్త

చిరు ధాన్యాలపై పరిశోధనలు



చిరుధాన్యాలపై వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధనలు చేస్తున్నాం. ఎక్కువగా చోడి రకంతో పాటు మిగిలిన వాటిపై కూడా చేస్తున్నాం. అధిక దిగుబడిని ఇచ్చే వంగడాలను అందించడానికి కృషి చేస్తున్నాం.

– డాక్టర్ నర్సుపల్లి అనూరాధ, వ్యవసాయ పరిశోధన స్థానం

సామలు, కొర్రలపై కూడా పరిశోధనలు

చిరుధాన్యాల్లో చోడితో పాటు సామలు, కొర్రలు, అండుకొర్రలు, అరిగలు, వరిగలపై కూడా పరిశోధనలు చేస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో ఏ రకం చిరుధాన్యాలను సాగు చేయవచ్చన్న దానిపై కూడా దృష్టి సారించారు. చిరుధాన్యాలు జిల్లాలో 3 వేల హెక్టార్ల వరకు ప్రస్తుతం సాగవుతున్నాయి. చోడి సాగు 2 వేల హెక్టార్లలో జరుగుతుండగా.. సామ, కొర్ర, అండు కొర్రలు, అరికలు, వరిగలు మిగిలిన వెయ్యి హెక్టార్లలో సాగవుతున్నాయి.

సమస్యల పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రజల నుంచి వచ్చే సమస్యల సత్వర పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణు చరణ్, డీఆర్‌ఓ జి.వెంకటరావుతో కలిసి నిర్వహించిన కలెక్టర్ నిషాంత్ కుమార్ ప్రజల నుంచి 90 అర్జీలు స్వీకరించారు.



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

వినతుల్లో కొన్ని ఇలా..

పార్వతీపురం మున్సిపాలిటీ పరిధిలోని 26వ వార్డులో ఉన్న రహదారిని ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేపట్టారని, ప్రజలు ఇబ్బందికి గురవుతున్నారని నరసింగ సాహు వినతిపత్రం సమర్పించారు.

- సర్వే నంబర్ 536–1లో డి పట్టా వేరే వారి పేరు మీద నమోదు చేసి ఉందని, తన పేరు మీద రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని మక్కువ మండలం శంబర గ్రామానికి చెందిన జె.ప్రసాదరావు కోరారు.
- సర్వే నంబర్ 117–2ఆ, 119–7, 120–2, 120–6కు పాస్ పుస్తకం ఇప్పించవలసిందిగా పార్వతీపురం మండలం అడ్డాపు శీల గ్రామానికి చెందిన డి. మణిభూషణరావు కోరారు.
- జనవరి 8వ తేదీ నుంచి ధాన్యం ప్రొక్యూర్ మెంట్ నిలిచిపోవడంతో ఇబ్బందికి గురవుతున్నామని, ధాన్యం మిల్లుకు చేరే ఏర్పాటు చేయాలని జియ్యమ్మవలస మండలం కన్నపుదొరవలస గ్రామానికి చెందిన రెడ్డి.గంగాభవాని దరఖాస్తు అందజేశారు.
- మక్కువ మండలం ఎ వెంకంపేట గ్రామ సచివాలయం పరిధిలో గ్రీన్ అంబాసిడర్‌గా మూడు సంవత్సరాలు నుంచి విధులు నిర్వహిస్తున్నానని, గడిచిన 10 మాసాలుగా జీతం రావడం లేదని, జీతం అందేలా చేయాలని గ్రామానికి చెందిన ఎస్.లక్ష్మణ్ కోరాడు.
- పార్వతీపురం మండలం డోకిశిల పంచాయతీలో గల ధాన్యం జనవరి నుంచి ఆన్‌లైన్ అవడం లేదు. రైతుల దగ్గర సుమారు 700 బస్తాలు ధాన్యం నిలిచిపోయాయి. ఆర్‌బీకే ద్వారా ధాన్యాన్ని సేకరించాలని పంచాయతీలోని చలమవలస గ్రామానికి చెందిన సీహెచ్. శ్రీను కోరారు.

వికలాంగులకు ప్రత్యేక కార్యక్రమం

దివ్యాంగ అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రత్యేకంగా జగనన్నకు చెబుదాం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ఈ కార్యక్రమానికి హాజరుకాగా పలువురు దివ్యాంగులు వినతులు అందజేశారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథరావు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్ కుమార్, పీఆర్ఎస్ఈ ఎంబీజీ కృష్ణాజీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఒ.ప్రభాకరరావు, డ్వామా పీడీ కె. రామచంద్ర రావు, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి వి.చిట్టి బాబు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి కేవీఎల్ఎన్ మూర్తి, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్, జిల్లా ప్రణాళిక అధికారి పి.వీర రాజు తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో ఫ్యాకల్టీ సదస్సు ప్రారంభం

విజయనగరం అర్బన్: ఇంజినీరింగ్ కళాశాలల్లో అత్యాధునిక సాంకేతిక విద్యా బోధన నైపుణ్యాలు మెరుగుపడాలని ఆ దిశగా బోధన సిబ్బంది తయారవ్వాలని వెస్ట్ బెంగాల్ రాష్ట్రంలోని కల్యాణి యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ అనిర్బన్ ముఖోపాధ్యాయ హితవు పలికారు. స్థానిక జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ) యూనివర్సిటీ ప్రాంగణంలోని ఇంజినీరింగ్ కళాశాలలో యూనివర్సిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మిషన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ అంశాలపై నిర్వహించే ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజజీవితంలో ఉపయోగపడే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సి, మిషన్ లెర్నింగ్ వంటి అత్యాధునిక సాంకేతిక కోర్సులపై అధ్యాపకులకు ముందుగా అవగాహన తప్పనిసరిగా ఉండాలని సూచించారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.స్వామినాయుడు ముఖ్యఅతిథిని ఘనంగా సత్కరించారు. రిసోర్స్ పర్సన్స్‌గా ఐఐటీ, ఎన్ఐటీ, స్టేట్ యూనివర్సిటీలు, పరిశ్రమల నుంచి ప్రతినిధులు పాల్గొన్నారు. యూనివర్సిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ సెల్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ జి.జయసుమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, యూనివర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ప్రొఫెసర్ కె.చంద్రభూషణ్, ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ కె.బాబు పాల్గొన్నారు.



ముఖ్యఅతిథిని సత్కరిస్తున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ స్వామినాయుడు

'జగనన్నకు చెబుదాం'కు 124 వినతులు

- అర్జీలను గడువులోగా పరిష్కరించాలి
- కలెక్టర్ సూర్యకుమారి



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం (స్పందన)' కార్యక్రమానికి ప్రజల నుంచి వివిధ సమస్యలకు సంబంధించి 124 వినతులు అందాయి. వాటిలో రెవెన్యూ విభాగానికి సంబంధించి అత్యధికంగా 79 ఉన్నాయి. హౌసింగ్‌కు 9, మున్సిపల్ శాఖకు 6, వైద్య శాఖకు 6 మిగిలినవి ఇతర శాఖలకు చెందిన అర్జీలున్నాయి. పింఛన్ల కోసం, రేషన్ కార్డుల జారీ, ఉపాధి కల్పన, ఉపాధి హామీ బిల్లుల చెల్లింపు ఇతర సమస్యలపై మిగిలిన వినతులు అందాయి. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్ అశోక్, డీఆర్‌ఓ గణపతిరావు, ప్రత్యేక ఉప కలెక్టర్లు పద్మావతి, సూర్యనారాయణ, దొరలు ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో వచ్చిన వినతులు పెండింగ్‌లో పెట్టకుండా గడువులోగా పరిష్కారమయ్యేలా చూడాలని స్పష్టం చేశారు.

ఉగాది నాటికి గృహాలు సిద్ధం చేయాలి

పేదలందరికీ ఇళ్ల కార్యక్రమం కింద నిర్మిస్తున్న గృహాలు ఉగాదికి గృహ ప్రవేశాల కోసం సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ లోగా పెండింగ్ పనులన్నీ వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. రెండవ శనివారం సెలవు అయినప్పటికీ హౌసింగ్ డే జరపాలని సూచించారు. ప్రత్యేకాధికారులు దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

మిగులు ధాన్యం కొనుగోలు చేయండి: రైతులు

మిగులు ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతూ గరివిడి మండలం వెదుళ్లవలస గ్రామ రైతులు సామూహికంగా కలెక్టర్ సూర్యకుమారికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో చెరువు ఆధారంగా సాగు చేసిన వరి పంట ఈ ఏడాది ఆలస్యంగా లభించిందని దీని వల్ల దిగుబడి నమోదు చేయకుండా కొనుగోలు లక్ష్యాలను ముగించారని తెలియజేశారు. ఇటీవల ప్రభుత్వం అనుమతి ఇచ్చిన లక్ష టన్నుల కొనుగోలు లక్ష్యంలో కూడా తమకు అవకాశం ఇవ్వలేదని వాపోయారు. గ్రామంలో దాదాపు 300 టన్నుల వరకు ధాన్యం అమ్మకానికి ఉందని ప్రభుత్వం కొనుగోలు చేస్తే మద్దతు ధర లభిస్తుందని ఆశతో ఉన్నామని పేర్కొన్నారు.

అపరాలకు కొనుగోలు కేంద్రాలు పెట్టాలి

జిల్లాలో ఈ ఏడాది పెసర, మినప పంట అధికంగా దిగుబడి వచ్చిందని ఈ పరిస్థితుల్లో మద్దతు ధరకు కొనుగోలు చేస్తే రైతుకు ప్రయోజనం ఉంటుందని ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షుడు ఎల్.ఆదినారాయణ అర్జీ అందజేశారు. ఆర్‌బీకేల్లో విక్రయించిన వేరుశనగ విత్తనాలకు చాలా చోట్ల కాపు దిగుబడి రాలేదని వినతిలో పేర్కొన్నారు.

మిగులు ధాన్యం సరఫరాకు అనుమతించాలి

- కలెక్టర్‌కు ఎమ్మెల్సీ విక్రాంత్ వినతి



కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ లోకలెక్టర్ నిషాంత్ కుమార్‌ను ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. పాలకొండ, వీరఘట్టం మండలాలకు చెందిన రైతులకు సంబంధించి 17వేల మెట్రిక్ టన్నుల ధాన్యం యాప్‌లో నమోదు కాగా ఇటీవల 7వేల మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల నుంచి సేకరించారన్నారు. మిగిలిన 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సరఫరాకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు. సీఎస్పీ రహదారి నుంచి చిదిమి గ్రామం వరకు, సీఎస్పీ రహదారి నుంచి ఆర్‌బీఆర్ పేట మీదుగా జంపరకోటవరకు రహదారి మరమ్మతుల కోసం నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆయనతో పాటు వీరఘట్టం ఎంపీపీ డి.వెంకటరమణ నాయుడు, కోట అజయ్ కుమార్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమందించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక



సమస్యలు వింటున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

విజయనగరం క్రైమ్: స్పందన కార్యక్రమానికి వచ్చి సమస్యలు తెలియజేస్తున్న ఫిర్యాదుదారులకు సత్వర న్యాయమందించాలని ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆమె 33 ఫిర్యాదులు అందుకున్నారు. బాధితుల సమస్యలను విని, సంబంధిత పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, ఫిర్యాదులు పరిష్కరించేందుకు చట్టపరిధిలో చర్యలు చేపట్టి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ సీహెచ్.రుద్రశేఖర్, ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు

పార్వతీపురంటౌన్: బాధితుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్‌నాయుడు చెప్పారు. ఈ మేరకు సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫిర్యాదు దారుల వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా బాధితుల సమస్యలపై ఎస్పీ సానుకూలంగా స్పందించి ప్రతి ఒక్కరి కేసు వివరాలు తెలుసుకుని సంబంధిత పోలీసు స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలియజేశారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్, దిశ డీఎస్పీ, ఏఆర్ డీఎస్పీ, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్, డీసీఆర్బీ సబ్ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

9న జాతీయ లోక్‌అదాలత్

విజయనగరం లీగల్: ఈనెల 9న జాతీయ లోక్ అదాలత్ విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయికల్యాణ చక్రవర్తి సోమవారం తెలిపారు. సివిల్, రాజీ అవ్వదగిన క్రిమినల్, మోటారువాహనాల చట్టానికి సంబంధించిన కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు పరిశీలించి అదాలత్‌లో పరిష్కరిస్తామన్నారు. ఇరు వర్గాలకు రాజీ మార్గాన్ని సూచించి వారి ఆమోదం మేరకే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని దీనిపై అప్పీలు చేసుకునే అవకాశం లేదన్నారు. సత్వర పరిష్కారానికి ఇవి దోహదపడతాయని తెలిపారు.కావున కక్షిదారులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



బి.సాయి కల్యాణ చక్రవర్తి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి

పరిశోధనలు చేయాలి

డెంకాడ: ఆత్మనిర్భర్ భారత్ దిశగా యువత పరిశోధనలు చేయాలని బెంగాల్‌కు చెందిన విశ్వధర్మ మందిరం ఇండియా ఆన్ మూవ్ ఎన్‌జీఓ వ్యవస్థాపకులు, ఆధ్యాత్మిక గురువు అజిత్‌కుమార్ ఆచార్య అన్నారు. జొన్నాడ వద్ద గల లెండి ఇంజినీరింగ్ కళాశాలలో వ్యక్తిత్వ తరగతుల్లో భాగంగా విద్యార్థులతో ఎ టాక్ ఆన్ ఎమోషనల్ ఇంటిలిజెన్స్‌కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థులు పఠనాశక్తితో పాటు భావోద్వేగ మేధస్సుకై పరిశ్రమించాలన్నారు. అనంతరం ముఖ్య అతిథి అజిత్‌కుమార్ ఆచార్యను కళాశాల చైర్మన్ పి.మధుసూధనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ టి.హరిబాబు, విభాగాధిపతి దర్గాశైలజ, అధ్యాపకులు సత్కరించారు.

కోడిగుడ్ల ధరలు	
హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్	
విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

చికెన్	
బ్రాయిలర్	
లైవ్	₹100
డ్రెస్డ్	₹170
స్కిన్‌లెస్	₹ 180

కలెక్టరేట్ ముట్టడి

- సమస్యల పరిష్కారం కోరుతూ అంగన్వాడీల నిరసన



కలెక్టరేట్ ముట్టడిలో పాల్గొన్న అంగన్వాడీ సిబ్బంది

విజయనగరం అర్బన్: కనీస వేతనాలు ఇవ్వాలని, ఫేస్ యాప్ రద్దు చేయాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ సోమవారం కలెక్టరేట్‌ను ముట్టడించి నిరసన చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అంగన్వాడీ సిబ్బంది కలెక్టరేట్ అవుట్ గేట్ వద్ద నినాదాలు చేశారు. ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కేంద్రాలకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ అమలుకు కొన్ని ప్రాజెక్టుల్లో గత 6 నెలల నుంచి బిల్లులు చెల్లించలేదని ఆరోపించారు. దీని వల్ల అంగన్వాడీలు అప్పులు చేసి లబ్ధిదారులకు ఆహారం వండిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో నెట్ సౌకర్యం లేకపోవడం వల్ల ఫేస్ యాప్ వినియోగించలేకపోతున్నామని, ఈ పరిస్థితుల్లో ఈ యాప్ వినియోగం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.పైడిరాజు, ఎస్.అనసూయ, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.శంకరావు, కె.సురేష్, జిల్లా నాయకులు వి.లక్ష్మి, టీవీరమణ, కృష్ణమ్మ, తులసి, వరలక్ష్మి, రమణమ్మ, జ్యోతి, శ్యామల, వెంకటలక్ష్మి, ఎస్.లక్ష్మి, ప్రభ, హైమ, మంగలక్ష్మి, సుధారాణి, సరళ తదితరులు పాల్గొన్నారు.

మూగజీవాల మృతి కేసులో.. ముద్దాయికి జైలు, జరిమానా

తెర్లాం: పశువుల శాలకు నిప్పు అంటించి ఆవు, లేగదూడ మృతికి కారణమైన ముద్దాయికి బొబ్బిలి పీజేసీజే కమ్ జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ సరోజినమ్మ రెండేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.4వేలు అపరాధ రుసుం విధిస్తూ సోమవారం తీర్పు చెప్పారు,. ఈ మేరకు తెర్లాం ఎస్సై ఆర్.రమేష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని రాజయ్యపేట గ్రామానికి చెందిన రెడ్డి సింహాచలం 2022 మార్చి 14న అదే గ్రామానికి చెందిన పైడియ్య పశువుల శాలకు నిప్పు అంటించాడు. ఈ ప్రమాదంలో పశువుల శాలలో ఉన్న ఆవు, లేగదూడ కాలిపోయి మృతిచెందాయి. బాధితుడు పైడియ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి పీపీ నరేష్ వాదనలు వినిపించారు.

చీరకు నిప్పంటుకుని గాయాలు

పార్వతీపురం: మంచం కింద పెట్టిన కుంపటి కారణంగా ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. ఈ సంఘటనపై పార్వతీపురం ఔట్‌పోస్టు పోలీసులు సోమవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మక్కువ మండలం కొన గ్రామా నికి చెందిన వెంకటమ్మకు కొద్ది సంవత్సరాలుగా మతిస్థిమితం లేకపోవడంతో విశాఖ లో చికిత్స పొందుతోంది. అయితే ఆదివారం రాత్రి ఆమె మంచం కింద కుంపటి పెట్టి పడు కుంది. ప్రమాదవశాత్తు కుంపటిలో చీరకొంగు పడడంతో మంటలు చెలరేగి శరీరమంతా కాలిపోయింది. దీంతో స్థానికులు గమనించి చికిత్స కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఔట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.